# వీకర్ సెక్షన్లు

ఈరడి చేతిలో గొడుగు వుంది.

ఆ గొడుకు కింద ఈరడి తల లేదు.

చిన్నయ్య దొర తలవుంది...

బావి గట్టు మీద నిల్చొని పొలాలు చూసుకుంటున్నాడు చిన్నయ్య దొర.

ఆ బావిలో నీళ్ళున్నాయి -

చిన్నయ్య దొర పొలాలు పచ్చగా నవ్వుతున్నాయి.

"దొర...నాకొక్కటి సమజ్ గాలె... జెర తవరె సెప్పాలె..." అని అడిగాడు ఈరడు.

"ఏందిరా అది?"

"ఈకర్ సెచ్చన్లు అంటే ఏంది దొరా? మాటకు ముందు నాయకులంతా గా మాటె అనబట్టిరి... అంటురోగం లెక్క అది నాయకులందరి నాల్కలకు అంటుకుంటాంది... జెర ఏందో సెప్పకపోతిరి..."

"అందరెందుకు అంటార్రా... ఆ పదం మాది...మా సొంతం... మా ఇలాఖా..."

"అవుమల్ల... నేను గట్లనే అనుకున్న... ఊర్లె సగం గొడ్డు గోదా మా దొరగారిది. గట్టనే గిదేందో కాని మా దొరగారిదే అనుకున్న. ఈకర్ సెచ్చన్లు అంటె ఏంటియి దొర కందులా? బాగా పిరమయినై గదా...

"కందులెందుకైతయిరా గాడ్డి కొడుకా... ఈకర్ సెక్షన్లంటె తెల్వదా ఈకర్ సెక్షన్లు?"

"గొర్రెలా బాంచెను..."

"ఉహూ..."

"ఆ... నాకెర్కె.. నాకెర్కె సమజ్ అయింది... ఈకర్ సెచ్చన్లంటె కోళ్ళు..."

"నీ అక్క నోర్మూయ్... ఈకర్ సెక్షన్లంటే కోళ్ళా! ఎవలన్న వింటె నవ్వుతరు.."

"తెల్వక అడుగుతాన జెర సెప్పరాదుండ్లి...."

"ఈకర్ సెక్షన్లంటె... బలీన వర్గాల్రా."

"అంటే ఏంది దొరా?

"బలీనవర్గాలంటె తెల్వదార? బలీన వర్గాలు-"

"ఉహూ... తెల్వది దొరా గులాపోన్ని కోప్పదకుండ్లి-"

"బలీన వర్గాలంటే బలం లేనోళ్ళురా..."

"అంటె ఆళ్లు మదుసులేనా దొరా!... నేను ఏందో అనుకున్నా..."

"మనుస్సులేరా... ఓట్లేసే మన్సులు..."

"దొరా నీ బాంచెను కాల్మొక్త... నాగ్గిప్పుడు సమజ్‌ల బట్టింది... ఈకర్ సెచ్చన్లంటె మదుసులేనా?... ఆళ్ళు మనూళ్ళె వున్నరా దొరా?"

"ఎందుకులేర్రా... అట్ల దూరంగా గట్టు మీద పోయెటోడు ఎవడు?"

అటువేపు చూశాడు ఈరడు - గడ్డిమోపు మోసుకుపోతున్న ఓదెలు కనిపించాడు.

"ఓదెలుగాడు బాంచెను."

"వాడు ఈకర్ సెక్షనే..."

"గదా తిర్కాసు... వంగి దండం పెట్టెటోడా ఈకర్ సెచ్చనంటె... అట్లనా... గట్లయితే నేను గూడ ఈకర్ సెచ్చనే గదా దొరా..."

"ఆ... నవ్వు కూడా..."

"దొరా... నేను ఈకర్ సెచ్చనయితే గావచ్చుగాని... గా ఓదెలు గాడు ఈకర్ సచ్చను ఎట్లయితడు?"

"ఎందుక్కాదురా... వాడు ఈకర్ సెక్షన్ గాడ్డి కొడుకేనాయె..."

"ఈకర్ సెచ్చన్లంటే బలీసులంటిరి... ఆడు సూసిండ్లా ఎట్ల బలంగ వున్నడో ఎద్దులెక్క."

"బలమంటె గా బలం గాదురా..."

"మరేంది బాంచెను?..."

"నీకు తెల్వది కాని నోర్మూయరా..."

"తవరి కాడ గిన్నియేండ్ల బట్టి నౌకరి సేత్తాన... తవరు గింత సెప్తె నాకు గంపంత తెల్వాలె... ఆడ్ని బలీసుడని ఎందుకనాల్నో నాకు సమజయింది దొరా..."

"ఏందిరా నీకు సమజయింది..."

"ఆడికెంత బలం వుంటె ఏంది... పది మంది బలీసుడివిరా అంటె ఆడు బలీసుడినె అనుకుంటడు... ఎవల జోలికి పోడు... వంగి దండం పెడ్తడు... ఆడు ఎద్దు లెక్కుంటె ఏంది ఏనుగు లెక్కుంటె ఏంది... కుక్కిన పేనైపోతడు. ముసల్ది... ఇద్దరు మన్వలు అని మా తాత కత సెప్పెటోడు దొరా... ఆ మన్వలు రాజు ఏనుగుల్ని తోక బట్టి ఆడించిండ్లట... గంత బలం వుండేదట ఆ పోరగాళ్ళకు... అది చూసే ముసల్ది ఆళ్ళ బలం ఎట్ల వొంచాల్నని ఇశారించి రోజూ బువ్వపెట్టి బిడ్డలారా...మనం కట్టంల వున్నం రా... మనం ఆధారం లేని పచ్చులంరా... ఇయ్యాల గీ కూడు దొరికింది... రేపు దొరుకుద్దో లేదో... ఏం చేద్దును బిడ్డల్లారా... అని ఏడ్సేదంటా... గట్ల... ఆ పోరగాళ్ళ దైర్నం డీల అయిందట... గప్పట్నించి గల్లీల రాజుగోరి ఏనుగు కనబడ్తె గజగజ వనుక్కుంట దూరంగ నిలబడె వోళ్ళంట... గందుకె గీ ఓదెలు గానసంటోల్లను ఈకర్ సెచ్చన్ అనాలె... డీల అయిపోతరు..."

ఈరడి మాటలు చిన్నయ్య దొరకు రుచించలేదు. కోపంతో ఏదో అనబోయేంతలో ఎల్.రావు అక్కడికొచ్చాడు. అతడు ఆ ప్రాంతంలోని ఏకైక కవి.

"దొర వారికి దండాలు..." అంటూ చేతులు జోడించాడు కవి.

"ఓహ్హో ఎల్లారావా! బాగున్నావా!" అని అడిగాడు చిన్నయ్యదొర.

"బాగానే వున్నాడు కవి. నా పేరు ఎల్లారావు కాదు ఎల్.రావని మనవి..."

"ఏదో రావు లేవయ్యా... ఏదన్నా కవిత్తం చెప్పు వినక చానరోజులయింది."

తనను పొగిడే కవిత్వమేదో కావాలనన్నట్లు మొహం పెట్టాడు చిన్నదొర.

"దొరగారు ఈకర్ సెక్చన్ల నాయకులు గదా...గాదాని మీద సెప్పరాదుండ్లి...." అన్నాడు ఈరడు.

కవి ఆలోచించాడు. మినీ కవిత ఒకటి వినిపించాడు...

కొమ్మ మీద కాకి వుంది...

నీళ్ల మీద పడవ వుంది...

పీకర్ సెక్షన్ల మీద దొరకు ప్రేమ వుంది...!

అదేవిటో అర్థంగాకున్నా తనను కవి పొగడుతున్నాడనుకొని మెచ్చుకోలుగా నవ్వేశాడు. చిన్నయ్య దొర.

***

అది చిన్నయ్య దొర దేవిడి.

కుర్చీలో విలాసంగా కూర్చున్నాడు చిన్నయ్య.

ఈరడు అగ్గిపుల్ల వెలిగిస్తే సిగరెట్ ముట్టించుకున్నాడు. హాయిగా ఒక దమ్ము లాగాడు.

"దొరా..." మెల్లిగా అన్నాడు ఈరడు.

"ఊ..."

"ఊల్లె అనుకుంటాండ్లు దొరా..."

"ఏమన్రా..."

"తవరు చెంబు పార్టీ నుంచి తపేలా పార్టిల చేరిండ్లట కదా..."

"ఊ..."

"దొర నాదో సిన్న అనుమానం... చెంబుపార్టీల తవర్ని పెజాసేవ చేయనిత్తలేరా?..."

"నీ కెందుకుర లంబ్లి కొడుకా గియన్ని... అసలు చెంబు పార్టీ ఒక పార్టేనా... తొత్తునా కొడుకులంత జేరి పార్టీని నాశనం చేసిరి...తపేలా పార్టే ఇప్పుడు ఈకర్ సెక్షన్ల పార్టీ..."

"గట్లనా... మొన్నటిదాంక తపేలా పార్టీ ఒట్టిది...మట్టిది అంటిరి..."

"అప్పుడు ఒట్టిదేరా... ఇప్పుడు గట్టిదయింది. ఎలక్షన్లల గెలుస్తది... ఈకర్ సెక్షన్లను బాగచేస్తది."

అంతలో సుందరం వచ్చాడు. అతడా ఊరి స్కూల్లో టీచర్...

"నమస్కారం సార్..." చిన్నయ్య దొరకు చేతులు జోడించాడు సుందరం.

చిన్నయ్య దొర తలెత్తి చూసి "నువ్వా పంతులు... దాదా...అరేయ్ ఈరిగా పంతులుకు కుర్సీ తీసుకురారా..." అన్నాడు.

ఈరడు కుర్చీ తెచ్చివేశాడు.

సుందరం కూర్చున్నాడు.

"ఆఁ...ఏం పంతులు ఏమో మా ఇల్లు పావనం చేస్తిరి..." అని అడిగాడు చిన్నయ్య దొర.

"మీరు పెద్దలు... అట్లనకండి దొరగారూ...మీ దర్శనం లేక చాలా రోజులయింది.."

"దొరగారికి తీర్కలేదండి... ఈకర్ సెచ్చన్ల పార్టి కోసురం ఎతుకుతున్నరుండి..."

"గా సమస్యలు ఎప్పుడూ ఉన్నయే పంతులు. జెర పైకొచ్చి ఈకర్ సెక్షన్లను బాగ చేద్దామనుకుంటె దొంగనా కొడుకులు అణగదొక్కాలని చూస్తరు – గా రాజకీయాలన్ని మీకెందుగ్గాని మీరు క్షేమంగా వున్నరు గదా...పోరగాళ్ళు సరింగ బడికి వొత్తాండ్లా? రాత్రి పూటకూడా బడి నడ్పబడ్తివి... ఎందుకు పంతులు గింత కష్టపడ్తవు!... రోజు రోజుకు మీరు అమాయకులై పోతున్నరు..."

"పిల్లలకే కాదు... పెద్దలకూ చదువు అవసరం కదా సార్... గ్రామాలలోని నిరక్షరాస్యత నిర్మూలింపబడేదాకా మనకు సామాజిక, ఆర్థిక ప్రగతి లేదండి... అదిగాక గ్రామ ప్రజలకు చదువు రాకపోతే తమరు చేస్తున్న మంచి పనులు వాళ్ళకెలా అర్థమవుతాయండీ? మొన్న మీరు పంచాయితీ సమితి ప్రెసిడెంట్‌ల మీటింగ్‌ల వీకర్ సెక్షన్లను బాగు చేయడం కోసం రక్తమైనా ధారపోస్తానని ఎంతో ఆవేశంగా మాట్లాడారు... ఆ వార్త పెద్ద పెద్ద అక్షరాలతో పేపర్లలో వచ్చింది. జనానికి చదువు వస్తేనేకదండి అవన్నీ చదువుకునేది..."

"అయ్యగోరు ఖర్సుకు ఎనుకాడలేదుండి... ఎంత దబ్బు కావాల్నంటె గంత ఇచ్చి ఏయించిండ్లు..."

"అరేయ్ ఈరిగా నువ్వు నోర్మూసుకో..."

అన్నాడు కోపంగా చిన్నయ్య.

"అలా నాలుగు గ్రామాల జనం తమ ఉపన్యాసాలు చదివినప్పుడే కదా తమ మంచితనం వారికి తెలిసేది.... తమరే వారి నాయకులని గుర్తించేది..."

"నిజమే పంతులు... బడితోని గిన్ని మంచి పనులున్నాయని తెలిసే ఆనాడు మా ఫాదరు వొద్దన్నా మా ఊళ్ళె బడి పెట్టించిన..."

"అలాగే మీ చేతుల మీదుగా మరో మంచిపని చేయించాలని వచ్చాను..."

"ఏం పని? ఏమన్న పైసలు ఖర్సయ్యేది కాదుకదా!" కంగారుగా అడిగాడు

చిన్నయ్య...

"కాదు సార్..."

"అయితే చెప్పు..."

"రాత్రిపూట బడికి వచ్చేవాళ్ళంతా చందాలిచ్చిఒక చిన్న లైబ్రరీకి సరిపోయే పుస్తకాలు తెప్పించుకున్నారు... ఆ లైబ్రరీకి తమరు ప్రారంభోత్సవం చేయాలి..."

"అవల్ రైటుగా... జనం బాగా వొస్తున్నరు గదా...

"వస్తారు సార్..."

"సరే పంతులు...ప్రారంభోత్సవం లాంటి మంచి పనులు చేయాల్నంటె మాకు ఈ సిగరెట్ కంటె ఇష్టం.... పోదాం పాండి...."అంటూ లేచాడు చిన్నయ్య...

"ఇప్పుడు కాదండీ..."

"దొరగారికి పెజాసేవ చేయాల్నని మా చెడ్డ ఏగిరంగ వున్నదుండి...." ఎంతో ఆనందంగా చెప్పాడు ఈరడు....

"ప్రారంభోత్సవం రేపు సాయంకాలం ఆరు గంటలకుంది. ముందుగా మీ అనుమతి తీసుకుందామని వచ్చానండీ..." అన్నాడు సుందరం.

"రేపు సాయంత్రికా! రేపు సాయింత్రికి మాదిగొల్ల వాడల రాయి పాతుతంగాదు..." అన్నాడు చిన్నయ్య.

"అవునట సార్... గుడి కట్టిస్తున్నారట కదా..."

"అటెంక అంటె ఎలెచ్చన్లు అయినంక బాంచెను..." ఈరడి నోరు వూర్కోదు... ఎంత వద్దనుకున్నా ఏదో అనేస్తుంటాడు. దొరగారి చేత తిట్లు తింటుంటాడు. కాని ప్రస్తుతం దొరగారు ఎలక్షన్ల గూర్చి ఆలోచిస్తున్నారు కనక ఈరడి మాటల్ని పట్టించుకోలేదు. తానింక ఏం చేయబోతున్నాడో సుందరంకు చెప్పారు.

"పన్లేపని రెండు కార్కానలకు... ఈకర్ సెక్షన్ల కోసం ఇండ్ల కాల్నీకీ రాళ్ళు పాతుదాం అనుకుంటాన...రాళ్ళు శాన్నే తెప్పించి పెట్టిన..."

"బండెడు బాంచెను... గిట్లసోంటి ఖర్చులేని పన్లు దబ దబ గావాలె... ఎలెచ్చన్లు దగ్గిర బడినయిగదా... దొరగోరు ఎమ్మెల్లేగా నిలబడ్తాండ్లు..." చిన్నయ్య దొర వంక చూస్తూ అన్నాడు ఈరడు....

"అవును సార్.... ఈకర్ సెక్షన్లను చూస్తాంటె నాగుండె చెరువైతాంది... కంటికి నిద్ర పట్టది.... తింటె కూడు సయించది... ఆళ్ళను బాగుచేయాల్నని ఒకటే ఇది... తవరు ఎమ్మెల్లే అయి మంతిరైతే గాని ఆళ్లు బాగ్గారు... వచ్చే ఎలక్షన్ల పోటీ చేయిండ్లి అని నా సపోర్టర్లంతా ఒకటే పోరుతున్నరు. ఆళ్ళ పోరు పడలేకనే నిలబడ్తాన... మరి మీరంతా నన్ను గెలిపించి ఈకర్ సెక్షన్లకు సేవజేసే అదురుట్టం కలిగించాలి...." అంటూ చేతులు జోడించి ఎన్నికల నవ్వు నవ్వాడు చిన్నయ్య.

"తమరు గాక ఇంకెవరు గెలుస్తారు సార్....వీకర్ సెక్షన్లకు తెలియదా తమరు వారి ప్రియతమ నాయకులని... వారే తమరిని గెలిపించుకుంటారు..." అన్నాడు సుందరం.

"తవరి నోటి వాక్యాన మా దొరగారు గెల్వాలెగాని మిమ్మల్ని పెద్ద పంతుల్ని చేయరూ..." తమరి తరఫున నేనే వాగ్దానం చేస్తున్నానన్నట్లు చిన్నయ్య దొర వంక చూశాడు ఈరడు.

చిన్నయ్య నవ్వి... "అట్లనే...అట్లనే పంతులు...మిమ్మల్ని ఏదన్న పెద్ద బడికి హెడ్‌మాస్టర్ చేయిస్త...." అని హామీ ఇచ్చారు.

సుందరం మామూలుగా...మొహంలో ఏ భావానికి తావు ఇవ్వకుండా,"ఏదో నాకీ ఉద్యోగం చాలు సార్...హెడ్‌మాస్టర్ కావాలనే కోరిక నాకు లేదు. ఈ వూరు వొదిలి పట్టణానికి పోవాలనే ఆశలేదు. రేపు సాయంత్రం లైబ్రరీకి ప్రారంభోత్సవం చేశాక మీరు హరిజనవాడలో శంకుస్థాపనకు పోవచ్చుగా..." అని అడిగాడు.

"అట్లనా..." అని ఆలోచించాడు చిన్నయ్య "సరే...అట్లనే కానియ్యి. పంతులు... ముందుగాల ప్రారంభోత్సవం చేసినంకనే రాయిపాతడానికి పోత..."

"ధన్యవాదాలు... ఇక వెళ్ళొస్తానండి..." లేచి నిల్చొని రెండు చేతులు జోడించాడు సుందరం.

***

రోజులు దొర్లిపోతున్నాయి...

పంచాయితీ సమితి ప్రెసిడెంటు చిన్నయ్యదొర రాళ్ళను పాతి శంకుస్థాపనలు చేస్తూనే వున్నాడు.

రాబోయే అసెంబ్లీ ఎలక్షన్లలో అవి తన విజయానికి పునాది అనుకుంటున్నాడు -

ఒక రోజు...

చిన్నయ్య మాత్రం కోపంతో మండిపడుతున్నాడు -

"అరె ఈరిగా...మన ఊళ్లె జనానికి ఏం పుట్టిందిరా?" ఎరుపు కళ్ళతో భయంకరంగా కనిపిస్తున్న చిన్నయ్యదొర...

"అదె బాంచెను...తవరికాళ్ళకు మొక్కుతనే వున్నరు... తవరు ఎదురైతె పక్కకు తప్పుకుంటనె వున్నరు గాదు..."

"అది సరేరా... రాళ్లు పాతె మిటింగులల్ల అడ్డదిడ్డం ప్రశ్న లేస్తరేందిరా!"

"ఎవరేత్తరు బాంచెన్...ఏసేటోల్లని కొట్టించినం గదా..."

"ఏందిరో ఎట్లున్నది ఒళ్ళు... అన్ని మనం కొట్టించినాంరా? ఆ..."

దొర ఉరిమి చూసే సరికి గజగజ వణికిపోయాడు ఈరడు.

"కాద్దొరా... మన్నించుండ్లి...ఆన్ని ఎవలో కొట్టి కాల్వల పడేసిండ్లు..."

"ఆ.."

సిగరెట్ వెలిగించుకున్నాడు చిన్నయ్య.

"దొరా..."

"ఊ..."

"ఇప్పుడేదన్నా మీటింగ్ వున్నదా..."

"ఔన్రా...చెంబు పార్టీ లీడర్ వస్తాండు... పెద్ద మీటింగ్ పెట్టాలె... మన బలం చూపించాలె..."

"అదేంది దొరా...నిన్నటి దాంక తవరు తపేల పార్టిల వుంటిరి...తెల్లారేసరికి చెంబుల దూకినారు!"

"ఆ...తపాల పార్టీ ఒక పార్టార? తూర్పు పడమట తెల్వని తొత్తుగాళ్ళంతా చేరిండ్లు ఆ పార్టీల..."

"గసోంటి పార్టీల వుండి తవరు ఈకర్ సెచ్చున్న సేవ ఎట్ల సేత్తరు దొరా... చెంబుల దూకి మంచిపని చేసిండ్లు... ఇగ ఈకర్ సెచ్చున్న సేవ బగ్గ సేత్తరా?"

"ఆ..ఆ.... మొదాలు మీటింగ్ పెట్టాలె కాదుర...చెంబు పార్టీ బలమెంతో చూసి నాకు ఎతిరేకంగా పోటీచేసె ఒక్కొక్క బాసుటర్ కొడుకు గుండె పగిలిపోవాలె..."

"మీటింగు పెట్టుండ్లి దొరా... బొడ్రాయి కాడ శానమంది జనమే పడ్తరు గదా..."

"మన ఊళ్ళైనా!...ఇయ్యాల రేపు మన ఊరి దొంగనాకొడుకులకు బలిసిందిరా... మీటింగ్‌లకు రారు... ఒక ప్రారంభోత్సవానికి రారు...ఈసారి శానా పెద్ద లీడర్ వస్తాండు. మీటింగ్‌కు శానామంది జనం కావాలె..."

"మంది కరువా దొర మన దేశంల... మన ఊరోళ్ళు కాకపోతే పక్క ఊరోళ్ళను తెద్దాం." సలహా యిచ్చాడు ఈరడు.

"అట్లనా!"... చిన్నయ్య మొహం ఒంటరి ఆడపిల్లను చూసిన పోలీసు పటేలు మొహంలా వెలిగిపోయింది.

"మీరు ఊ అనుండ్లి దొరా... లారీల కొద్ది తెత్త జనాన్ని... అయితే దానిక్కొంత ఖర్చు అవుద్ది మరి...మీకో ఖర్సు గాని రాళ్ళు పాతె పనులు గావాల్నాయే..."

"నీ అవ్వ ఖర్చుదేందిరా...ఇయ్యాల పోతది... రేపు వొత్తది... గిటువంటి పనికాడ ఖర్సుకు భయపడ్తారా... మనకు మంది కావాలె...మన మీటింట్‌ల కూసోడానికి జాగలేక జనం ఒగరి మీద ఒగరు నిల్సోవాలె. గతమంది జనం కావాలె..."

"గట్లయితే రొండు లారీలు ఇప్పించుండ్లి...ఊర్లెంబడ పడి మందిని తోలుకొత్త..."

తోలుకొస్తవు సరెగాని...జెరమంచోళ్ళను చూసి తోలుక రావాలె..."

"మంచోళ్ళంటె ఎట్లాంటోళ్ళను బాంచెను! నోరు లేనోళ్ళను చెవులున్నోళ్ళను తెత్తె సరి గదా..."

"ఆ..జెర చేతులున్నోళ్ళను గూడ సూడు...చప్పట్లు కొట్లాలె..."

"అంగో... చప్పట్లంటె ఎక్కువ ఖర్సయిద్ది... ఉత్త మీటింగు ఇనదానికి వొత్తె ఒక రేటు... చప్పట్లు కొట్టేదానికి ఇంకో రేటు వున్నది దొరా...

"సరే...చప్పట్లు కొట్టే రేటెంబడే తోలుకురా... గుమాస్తనడిగి పైసలు కొంటబో..." అని చెప్పాడు చిన్నయ్య దొర.

"దొర గారికి ప్రణామాలు..."

తలెత్తి చూశాడు చిన్నయ్య దొర.

చేతులు జోడించి నిల్చున్న కవి ఎల్.రావు కనిపించాడు.

"తమరికో మినీకవితను అంకితం చేద్దామని ఈ కవి వచ్చాడు. మీ ముందు నిలిచాడు..." అన్నాడు కవి.

"అదేందో చదువు కవీ విందాం..." కుతూహలంగా చూశాడు చిన్నయ్య దొర.

కవి తన మిని కవిత వినిపించాడు.

బెల్లం ముక్క నోట్లో వేసుకుంటే మాట తీపిగా వుంటుందా...

అత్తరు పూసుక దిగితే ఫోటో గుబాళిస్తుందా...

వీకర్ సెక్షన్ల పదం వాడితే పార్టీ గెలుస్తుందా...

తపాలా వీకర్ సెక్షన్ల పార్టీ అనడంలో అన్నృతం వుందా...

ఆ కవిత విని చిన్నయ్య దొర మొహం

కవి ఆశించిన రీతిలో వెలగలేదు.

"చూడు...కవీ... నేనిప్పుడు తపాల పార్టిల లేను. చెంబుపార్టీల వున్న... నీ కవిత్తం బాగలేదు –"

"పొరపాటును మన్నించండి...దొరా... తమరు పార్టీ మారిన మంచి విషయం నాకు తెలియదు... కవితను మళ్ళీ చదువుతాను దయచేసి వినండి..."

అని కవి ఇలా చదివాడు.

బెల్లం ముక్క నోట్లో వేసుకుంటే మాట తీయగా వుంటుందా...

అత్తరు పూసుకు దిగితే ఫోలో గుబాళిస్తుందా...

'వీకర్ సెక్షన్లు' పదం వాడితే పార్టీ గెలుస్తుందా...

'చెంబు' వీకర్ సెక్షన్ల పార్టీ అనడంలోఆవృతం వుందా!...

"సెభాష్ కవి...మా గొప్ప కవిత్తం చెప్పినవు... ఎనకట రాజులు తమ ఒంటిమీది ముత్తాల హారాలు కవులకు ఇచ్చేవోరట... నా దగ్గర గసోంటి హారాలు లేవు. ప్రస్తుతానికి గీ సెగరెట్ పెట్టె, అగ్గిపెట్టె వుంది కొంటబోండి.... నేను ఎలక్షన గెలిచి మంత్రి నయినంక నిన్ను తప్పక ఆస్థాన కవిని చేస్తా..." అని హామీ ఇచ్చాడు చిన్నయ్య దొర.

"ధన్యోస్మి..." అంటూ సిగరెట్ పెట్టె, అగ్గిపెట్టె అందుకుని వెళ్లిపోయాడు కవి.

గుమస్తా శంకరయ్య వచ్చాడు – వెంట కండలు తిరిగిన ఓ వస్తాదు వున్నాడు.

ఎవడ్రా వీడు అన్నట్లు చూశాడు దొర –

"వీడు పద్నాలుగు రేప్‌లు, ఆరు హత్యలు చేసినారితేరిన గూండా సార్.... పదిమంది గూండాలకు నాయకుడు – మనకు ఎలక్షన్ల పనికొస్తాడని తీసుకొచ్చాను..." ఆ శాల్తీ గురించి వివరించాడు శంకరయ్య.

అప్పుడా శాల్తీ వినయంగా నమస్కరించింది.

చిన్నయ్య దొర సంతోషించి ఆశీర్వదించాడు -

"ఒరే గూండా నువ్వు నాకు అండా...నేన్నీకు అండా..." అన్నాడు-

గూండా ఆనందం పట్టలేక ఐదు నిమిషాల దాకా సాష్టాంగ నమస్కార వ్యాయామం చేశాడు.

"సార్? వీడిదో చిన్న కోరిక ఉంది... అది మీరు తప్పక నెరవేరుస్తారని హామీ ఇచ్చి తీసుకొచ్చాను..."

"ఏంటిదది?"

"ఏం లేదు సార్...చాలా చిన్న కోరిక...మీరు ఎలక్షన్లో గెలిచి మంత్రి అయాక వీడిని ఆస్థాన గూండాను చేయాలి.... అంతే..."

"ఓస్ గదేనా...అట్లనే చేస్తాం... వీణ్ణి తప్పక ఆస్థాన గూండాను చేస్తాం" అన్నాడు నవ్వుతూ చిన్నయ్యదొర.

"పేరు మార్చినా ఫరవాలేదు సార్...ఆ హోదా వుంటే చాలట..."

"అట్లనే... అట్లనె గాని వీడు మాట్లాడదేంది?"

"వీడు నోటితో ఎక్కువ మాట్లాడదుసార్... చేతులతోనే అంతా-"

"ఉహూ....శానా పనెడో. వీణ్ణి తీసుకపోయి తర్ఫీదు బాగా చెయ్యి. రేపు మన చెంబు పార్టీ లీడర్ వొస్తాండు. మీటింగ్ ఉంటది... ఆ తరువాత మన అప్పొజిషన్ పార్టీల మీటింగ్‌లు వుంటయి... అర్థమయ్యిందా!"

అర్థమయింది అన్నాడు శంకరయ్య.

కాబోయే ఆస్థాన గూండాను అడిగి చూశాడు. అతని పిడికిలి బిగుసుకపోవడం చూసి అర్థమయిందని గమనించాడు - ఆ తరువాత వాళ్ళిద్దరూ వెళ్లిపోయారు...

జరపబోయే మీటింగ్ చిన్నయ్య ఆలోచనలను ఆక్రమించుకుంది.

తన భవిష్యత్తు అంతా ఆ మీటింగ్ మీద వుందని అతని నమ్మకం -

ఆ రోజు గ్రామంలో చెంబు పార్టీ మీటింగ్ -

లారీలు అంకెలను దింపుతున్నాయి.

చిన్నయ్య దొర సంఖ్యను చూసి మురిసిపోతున్నాడు.

అందరు చెంబుపార్టీ నాయకుని కోసం ఎదురు చూస్తున్నారు.

చూడగా చూడగా చూడగా చూస్తున్న కళ్ళల్లో దుమ్ము కొడుతూ గంట సేపటికి ఒక కారు వొచ్చి ఆగింది.

చిన్నయ్య దొర గబగబ ఎదురేగి ఆ కారు తలుపు తాకి చెంబు పార్టీ నాయకునికి స్వాగతం పలికాడు.

"అంతా రెడియేనా?" అని అడిగాడు కారు దిగుతూ నాయకుడు.

"రెడీ... అండి" అన్నాడు చిన్నయ్య.

నాయకుడు చిన్నయ్య దొరను దగ్గరికి పిలిచి చెవిలో గుసగుసలు ఊదాడు.

"చప్పట్లు కొట్టే జనాన్ని తెప్పించినవా?"

"ఆ..."

"విలేకరులు చాలా మంది వచ్చారు. జనం ఎంత బాగా చప్పట్లు కొడితే అంత బాగా పేపర్లలో రాస్తారు. దాని వల్లా నీకూ పేరొస్తుందోయ్..."

"ఆ...ఆ... తెప్పించిన్నండి... జెర గట్టి గట్టోళ్ళను...చేతులున్నోళ్ళను. తెప్పించిన, మనకు చప్పట్లకు ఢోకాలేదు –"

"అయితే...పద..." అంకెల దిక్కు చూసి చేతులు జోడించి నడిచాడు నాయకుడు.

అతని కంటికి నల్ల కళ్లద్దాలున్నాయి.

అతని ఒంటికి తెల్ల ఖద్దరు బట్టలున్నాయి. అతని ఇంటికి బంగారు ఇటుకలు వుండగలవు..

అంకెలు చప్పట్లు కొట్టాయి...

అతని నడకలో రాజఠీవి హెచ్చింది... అతని మొహం మీదికి చిరునవ్వు వచ్చింది...

ఉచితాసనంపై ఆసీనుడు కాబోతూ మరోసారి చేతులు జోడించాడు.

మరోసారి అంకెలు చప్పట్లు కొట్టాయి.

అంకెల మధ్య ఈరడి పక్క కూర్చున్న ఓ అంకె ఆ చప్పట్ల సంఖ్యను లెక్కించు కుంటున్నది.

ఉపన్యాసాన్ని చిన్నయ్యదొర ముందుగా ఇలా ప్రారంభించాడు.

"మా జనులారా... ఇయ్యాల మన ఊరికెంతో... మన ఊరికెంతో సుదినం...

సుదినం... అంటే పండుగ దినం అన్నమాట.మన కట్టాల్ని దూరం జేసె... మన ఈకర్ సెక్షన్ల ఏకైక...ఏకైక పార్టీ అయిన చెంబు పార్టీ నాయకులు (అంకెలు చప్పట్ల వర్షం కురిపించాయి...) నాకు తెల్సు జనులారా...మీకు మా... అదే మన పార్టీ అంటే ఎంత ఇదో...ఎంత ఇదో నాకు తెలుసు... చెంబుపార్టీ ఈకర్ సెక్షన్లు ఒకటే మా జనులారా...అట్టి పార్టీ నాయకుడు... ఈకర్ సెక్షన్ల ఏకైక నాయకుడు మన తాయిలం రాయుడు గారు... (అంకెలు కుండపోతగా చప్పట్లు కురిపించాయి....) అట్టి నాయకులైన తాయిలం రాయుడు గారు ఇయ్యాల మన ఊరికి రావడం నిజంగా మన ఎన్కటి జన్మలచేసుకున్న అది... అదే జనులారా మీకు తెలుసు... అద్దేంటిదో మీకు తెల్సు జనులారా... (ఆ పదం గుర్తుకు రాలేదు చిన్నయ్య దొరకు... అంకెలు చప్పట్ల హోరును వినిపించాయి.)

చిన్నయ్య దొర ఎంతో సంతోషించి తాయిలం రాయుడి గారి వంక చూశాడు...

తాయిలం రాయుడు తృప్తిగా నవ్వాడు -

అంచేత రెట్టింపుఉత్సాహంతో చిన్నయ్య దొర ఉపన్యాసాన్ని కొనసాగించాడు -

"మా జనులార... తాయిలం రాయుడుగారు మన ఊరికి వచ్చిన ఆనందంలో నా నాల్కె తడబడతాంది... ఏం మాట్లాడ్దామన్నా మాట వొస్తలేదు... అందువల్ల మా జనులారా నేను ఎక్కువ మాట్లాడ - నాకు తెలుసు మీరంతా తాయిలం గారి ఉపన్యాసం ఇనాలని మా ఇదిగ వున్నరని... తాయిలం గారిలాంటి గొప్ప మన్సి మన ఊరు రావడం మనందరి అదురుట్టం... (అంకెలు చప్పట్ల చినుకుల్ని రాల్చాయి).... మనకు ఊపిరి ఎంత ముఖ్ఖెమో చెంబుపార్టీ అంత ముఖ్ఖెం జనులారా... నిజం చెప్పాలంటే మనం ఈనాడు ఊపిరి పీలుస్తున్నమంటె చెంబుపార్టీ వల్లనే... తాయిలం రాయుడుగారే మనకు సక్కగా గాలిసరఫరా చేయిస్తున్నరు... (అంకెలు చప్పట్ల గాలి వానను వినిపించాయి - ఈరడి పక్కన కూర్చున్న అంకె చప్పట్ల సంఖ్య లెక్కబదుతున్నది...) తాయిలం రాయుడుగారు ఈకర్ సెక్షన్లను ఉత్తరించడానికి... ఎవరో వచ్చి దొరచెవిలో చెప్పారు 'అయ్యా ఉత్తరించడానిక్కాదు... ఉద్ధరించడానికి..." ఆ... ఆ...నాకు తెలుసు జనులారా... మీకు తెల్సు... నేను కూడ అందుకే... అంటే ఈకర్ సెక్షన్లు ఉత్తరించడానికి... కాదు కాదు జనులారా నేను ముందుగాల్నె మనవి చేసిన...తాయిలం రాయుడు గారిని చూసిన సంబురంల నా నాల్కె తడబడుతాంది... నేను గూడ అట్ల ఈకర్ సెక్షన్లను చేయడానికె... ఈకర్ సెక్షన్ కోసమే పుట్టిన జనులారా...రాజకీయాలల్ల అడుగుపెట్టిన జనులారా... (అంకెలు చప్పట్ల చిటపటల్ని వినిపించాయి. ఈరడి పక్కన అంకె అది ఎన్నవసారో లెక్క రాసుకున్నది)...."

వరుసగా అలా తన మాటలకు అంకెలు చప్పట్లు కొట్టడంచూసి చిన్నయ్య దొర చాలా ఖుషీ అయ్యాడు –

"మా జనులారా... ఇంగ నా ఉపన్నాసం ఆపేస్తాన... నాకు తెలుసు జనులారా మీరంతా తాయిలం గారి ఉపన్నాసం ఇనడానికే వొచ్చిండ్లు... అందువల్ల మీ అందరి తరపున... మరి నా తరఫున ఇప్పుడు మన ఈకర్ సెక్షన్ల నాయకులైన తాయిలం గారిని తమ అందేశం.... అదే మా జనులారా సందేశం... ఇయ్యమని వోరుతున్నాను..." అని కుర్చీలో కూర్చున్నాడు. (అంకెలు అయిదు నిమిషాలదాకా చప్పట్ల వర్షపాతాన్ని రికార్డ్ చేశాయి.)

తాయిలం రాయుడు లేచి నిల్చున్నాడు – అంకెలు తిరిగి చప్పట్లను కురిపించాయి.

సంతోషంగా చేతులు జోడించి విలేకర్లు ఆ చప్పట్లు వింటున్నారో లేదో గమనించి తాయిలం రాయుడు తన ఉపన్యాసాన్ని ప్రారంభించాడు.

"ఈ ప్రాంతానికి మహనాయకులైన చిన్నయ్యగారూ... (అంకెల చప్పట్ల ప్రవాహాన్ని ఉధృతంగా వినిపించాయి) మమ్మల్ని ఎన్నుకొనే మానవీయులారా...మహాజనులారా... (అంకెలు చప్పట్లు ధారల్ని కురిపించాయి...) మీ అందరి దీవెనలతో మా పార్టీ... ఇంత పెరిగింది (అంటూ తన ఎత్తైన బొజ్జ నిమురుకున్నాడు – అది ఆయన అలవాటు కాబోలు...) (అంకెలు మరోసారి చప్పట్ల వెల్లువను వినిపించాయి...) ఈరడి పక్కన కుర్చున్న అంకె అది ఎన్నవసారి చప్పట్లుకొట్టడమో లెక్క రాసుకుని కాగితాన్ని మడచిజేబులో పెట్టుకున్నాడు) మీ అందరి సేవ చేయడానికి...ముఖ్యంగా వీకర్ సెక్షన్ల సేవకు... వారి అభివృద్ధికి మా చెంబు పార్టీ పాటుపడుతుంది. (ఆగాడు – చప్పట్ల కోసం – కాని ఎవరూ చప్పట్లు కొట్టలేదు) వీకర్ సెక్షన్ల సేవే మా చెంబు పార్టీ లక్ష్యం. (గొంతు చించుకుని అరిచాడు – ఉహూ... చప్పట్లు లేవు) వీకర్ సెక్షన్లు స్ట్రాంగు సెక్షన్లను బాగుచేసే దాకా నిద్రపోం... నీళ్లు మట్టం... గాలిపీల్చం"... ఈసారైనా చప్పట్లు కొడ్తారని ఆశించాడు... కాని చప్పట్లు లేవు. కోపంగా చిన్నయ్యను చూశాడు – చిన్నయ్య కోపంగా ఈరన్ని చూశాడు – ఈరడు పక్కనున్న అంకెను చూశాడు. చడీ చప్పుడు లేకుండా కూర్చుంది అంకె. అప్పటి దాకా ఆ అంకె చప్పట్లు కురిపించినపుడే... మిగతా అంకెలన్నీ కురిపించాయి... మీరు మాట్లాడుండ్లి నేను కొట్టిస్తా అన్నట్లు తాయిలం రాయుడికి సైగ జేశాడు చిన్నయ్య – తాయిలం తిరిగి ఉపన్యాసం ప్రారంభించాడు.

"...గాంధీ మహాత్ముడు స్వాతంత్ర్యం కోసం పుట్టాడు - మా చెంబు పార్టీ వీకర్ సెక్షన్ల కోసం పుట్టింది. పందొమ్మిది వందల... పందొమ్మిది వందల నలభై తొమ్మిది ఆగస్టు 15న మనకు... (సంవత్సరం సరిగా గుర్తు రాక తడబడి వాక్యం మార్చేశాడు...) పది సంవత్సరాల లోపల మా చెంబు పార్టీ వీకర్ సెక్షన్లకు ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సంపాదించి ఇస్తుంది. అడిగినవారికి లేదనకుండా ఉద్యోగాలను పంచి పెడుతుంది. అసలు, దేశాన్నే మార్చేస్తుంది. రామ రాజ్యాన్ని స్థాపిస్తుంది..." (చిన్నయ్య ఈరనికి సైగ చేశాడు చప్పట్లు కొట్టించమని... ఈరడు పక్కనున్న అంకెతో ఆ మాట అన్నాడు...!) "మేమెందుకు కొడ్తమయ్యా... మా చేతులు ఎట్టి చేయడానికి వొచ్చినయ్యా మీరిచ్చిన పైసల కాడ్కి చప్పట్లు కొట్టినం... ఇగ కొట్టం..." అని బిగ్గరగా అంది అంకె.

ఆ మాటలు విని అంకెలతో పాటు కూర్చున్న జనం గట్టిగా నవ్వారు... గలాటా మొదలయింది. తాయిలం రాయుడ ఉపన్యాసం కొనసాగించాడు -

"...మా పార్టీ మీటింగ్‌ను విఘ్నం చేయాలని ఒక పార్టీ సంకల్పించుకున్నది. ఇది ప్రజాస్వామ్య చర్యయేనా?అని నేను ఆ పార్టీకి సవాలు చేస్తున్నాను. మేం వీకర్ సెక్షన్లవైపు వున్నామని...వీకర్ సెక్షన్లు మావైపు ఉన్నాయని తెలిసి సోదరులారా కొన్ని పార్టీలు మాపై కక్ష గట్టినాయి. కాని మీరంతా మా పక్షమని మాకు తెలుసు... మా చెంబు పార్టీ మీదని మీకు తెలుసు. కూర్చోండ్డి... మహాజనులారా కూర్చోండ్డి... మనలను వ్యతిరేకించేవారికి తగిన గుణపాఠం నేర్పాలని మిమ్మల్ని కోరుతూ...వచ్చే ఎన్నికల్లో మీరు వీకర్ సెక్షన్ల పార్టీ అయిన చెంబు పార్టీని గెలిపిస్తారని ఆశిస్తూ నాకీ మహదవకాశాన్నిచ్చిన మీ అందరికీ మరోసారి కృతజ్ఞాభివందనములు తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను. జైహింద్... గట్టిగా అనండి మహాజనులారా జైహింద్...

అలా తాయిలం రాయుడిగారి ఉపన్యాసం ముగిసింది.

మీటింగ్ కూడా ముగిసింది.

***

మరునాడు మధ్యాహ్నం తన పార్టీ పెద్దలను పిలిచి దేవిడీలో పెద్ద పార్టీ ఇచ్చాడు చిన్నయ్యదొర. చికెన్ ముక్కలు కొరుకుతూ, గ్లాసులు ఖాళీ చేస్తూ వీకర్ సెక్షన్ల గూర్చి మాట్లాడసాగారు పెద్దలు. తమ పార్టీ వీకర్ సెక్షన్ల కోసమే వుందని పదే పదే ఒకరికొకరు చెప్పుకున్నారు.

తాము ప్రభుత్వాన్ని చేపట్టకపోతే, మంత్రులం కాకపోతే వీకర్ సెక్షన్‌లకు భవిష్యత్తు

లేదని గట్టిగా చెప్పుకున్నారు - అసలు దేశానికే భవిష్యత్తు లేదన్నారు -

అంతలో ఈరడు చిన్నయ్య దొర దగ్గరికి వచ్చి తపేలా పార్టీ రంగారావు హరిజనవాడలో కనిపించాడని చెప్పాడు. నోటినిండా చికెన్ కుక్కుకున్న ఒక సెక్షన్ నాయకుడు లేచి..."త...పాలా... పార్టీ... ఈకర్ సెక్షన్లను కొట్టేస్తుంది... అయ్యో, ఎట్లా?" అని ఏడ్చి - "కాబట్టి మనం...ఎంటనే...హరిజనవాడకు పోయి..." అని గట గట రెండు గ్లాసులు కొట్టేసి... ఓ త్రేన్పు తేన్చి... "ఈకర్ సెక్షన్ కోసం మన దగ్గరే... పణాళికలున్నయి...ఎవల దగ్గర లేవు... అని మనం హరిజనులకు చెప్పాలె..." అన్నాడు-

"ఎలక్షన్లు దగ్గరి కొస్తున్నయి. ఈకర్ సెక్షన్ల ఎంట పడాలె ఇగ మనం...ఏదన్న ఎత్తుగడతోనే తపాల పార్టీ హరిజనవాడలో తిరుగుతోంది. ఆళ్లేం మాట్లాడ్తాండ్లో అంతకంటె మంచిమాటలు మనం చెప్పాలె. అళ్ళను మన దిక్కు తిప్పుకోవాల... ఈకర్ సెక్షన్లందర్ని మన దిక్కే తిప్పుకోవాలె... నూటికి ఎనభై శాతం ఓట్లన్ని ఆ కొడుకులయేనాయె... అందుకు నేన్ చెప్పేందేమంటే మనం దేవుని భజన చేసినా చేయకున్నా ఈ నాల్గు రోజులు ఈకర్ సెక్షన్ల భజన చేయాలె..." అన్నాడు మరో నాయకుడు.

ఈరని వెంట కొందరు పని వాళ్ళను పంపించాడు చిన్నయ్య దొర. హరిజనవాడలో తపాలా పార్టీ రంగయ్య, అతని సహచరులు ఏం చేస్తున్నారో, ఏం మాట్లాడుతున్నారో తెలుసుకొని రమ్మన్నాడు.

అలా వెళ్ళిన ఈరడు, మిగతా పనివాళ్ళు గంటలో తిరిగొచ్చారు.

అప్పటికే 'ఈకర్ సెక్షన్ల' మహానాయకులు చాలా మంది మందులో స్నానం చేసి మత్తుగా పరుపుల మీద దొర్లుతున్నారు.

చిన్నయ్య దొర మాత్రం కుర్చీలో విలాసంగా కూర్చొని మనసులో రంగయ్యను చిత్రవధకు గురి చేస్తున్నాడు.

"దొరా... ఆ తపాలాపార్టీ రంగయ్య పజాసేవ మొదలు పెట్టిండు. పజాసేవ తవరు చేయాలె గదా దొరా... అనికేం పజాసేవ చేయత్తది!... కత్తి పట్టరానోడు గడ్డం గీకుతె బొండిగ తెగదీ... పజాసేవ చెయ్యరానోడు చెత్తే పజలు ఇదైపోతరు... తవరు ఏగిరంగ పజల్ను రచ్చించాలె దొరా..." అన్నాడు ఈరడు చేతులు జోడిస్తూ...

"ఇంతకు ఆడ ఏమైందిరా? ఆ రంగయ్య గాడ్డి కొడుకు అరిజన వాడల మీటింగు గిట్ట పెట్టిండా?" ఆత్రుతగా అడిగాడు చిన్నయ్యదొర.

"లే... మీటింగు పెట్టలే దొరా..." ఈరని వెంట వెళ్లి వచ్చిన పనివాళ్ళు అన్నారు-

తేలిగ్గా ఊపిరి పీల్చాడు చిన్నయ్య.

"మరా తపాలా పార్టీ లంబ్డి కొడుకులు అరిజన వాడకు ఎందుకు బోయినట్టు..."

"చెప్తినిగదా దొరా... అల్లు ఈకర్ సెక్షన్ల సేవ మొదలు పెట్టిండ్రు–" చేతులు కట్టుకొని అన్నాడు ఈరడు.

"ఆళ్ళెవండ్లురా కోన్‌కిస్కా గాండ్లు ఈకర్ సెక్షన్ల సేవ జేయడాన్కి... మేం రా ఈకర్ సెక్షన్ల సేవ చేసేటోల్లం..."

"మరి ఆళ్ళు చెంద్రుగాని గుడిసెకు పోయిండ్లు దొరా... చెంద్రుగానికి పానంల బాగలేకపోయె గదా... మంచం మీదికెల్లి లేత్తలేదు... తపాల పార్టీ రంగయ్య చెంద్రిగాని పక్కన కూసోని "నీకేం భయం లేదురా చెంద్రిగా... నేను డాక్టర్ను తీసుకుపచ్చి మందులిప్పిస్త...." అన్నడటనుండి. ఆడు డాకుటర్ను తేవడానికి పోయిండట..." తాను విన్న సంగతులు వివరించాడు. ఈరడు.

"అట్లనా... అరిజనవాడను బుట్టలేసుకోవాల్నని చూస్తున్నాడు రంగడు. నాకు పోటీకి వస్తాండన్న మాట... వాని బలుపు వంచుతాను..." మీసం మీద చేయి వేశాడు చిన్నయ్య.

"ఆడి ఎంట ఏనుగుల్లెక్క ఐదారు మంది వున్నరుండి... రౌడీ నా కొడుకులు గావచ్చుండి.."

"అరేయ్ గుమస్తాను ఇటు పిలుపు" ఒక పని వాడకి చెప్పాడు చిన్నయ్య.

గుమస్తా శంకరయ్య వచ్చాడు.

"పిలిచిండ్లా సార్..."

"సూడు శంకరయ్య... నువ్వు గుండాగాణ్ని తెస్తివి గదా వాడేడి?" శంకరయ్యను చూసి అడిగాడు చిన్నయ్య.

"ఉన్నడు సార్..."

"వాణ్ని... వాని ఎంట వున్న గుండాల్ని పిలిపించు అర్జంటు..."

"అట్లాగే సార్..." అని శంకరయ్య వెళ్ళిపోయాడు.

కాస్త స్పృహలో వున్న ఒక చెంబు పార్టీ నాయకుడు పరుపు మీది నుంచి లేచి చిన్నయ్య దగ్గరికి వచ్చి –

"ఆ తపాలా రాస్కెల్... కంటె... ముందు మనమే ఒక డాక్టరును ఆ వాడకు తీసుకెళ్తె మంచిది..." అని సలహా ఇచ్చాడు.

"లేకపోతే ఆ తపాలా పార్టీ రంగడే డాక్టర్ను తీసుకుపోయిండు అనుకోండ్లి... అప్పుడు అరిజనవాడంత ఏమనుకుంటరు? ఈ దొర మా కోసం శాన కష్టపడ్తాండు. మాదాంట్ల ఒగనికి పానంల బాగలేకపోతే సాయంగ డాక్టర్ను తెచ్చిండు అనుకుంటరు. అప్పుడు అరిజనవాడంతా ఆ రంగడి వశమై పోతుంది. రేపు ఎలక్షన్ల వాడికి ఓటేస్తరు. చిన్నయ్యగారికి ఏయరు. కాబట్టి మనమే వాడికంటే ముందుగా ఓ డాక్టర్ను తీసుకొని అరిజనవాడకు ఎల్లాలి. ఆడి చేత టాబ్‌లేట్ మింగించాలి. అప్పుడు హరిజనునికి మనం చేస్తున్న సేవ మిగతా జనం చూస్తరు. మన వైపు వుంటరు. మన ఓట్లకు ధోకా వుండదు-" అన్నాడు మరో నాయకుడు -

"నివ్వద్దే... కాని వున్న ఫలంగా మనకిప్పుడు డాక్టరెట్ల వస్తడు?" సందేహం వెలిబుచ్చాడు ఇంకొక నాయకుడు.

"ఈ ఊర్లె డాక్టర్లు లేరా?" మరో నాయకుడి ప్రశ్న.

"మా ఊళ్ళె కెవలన్న డాకుటరు వొత్తె రొండు దినాల్ల జబ్బునపడ్డ మడిసి లెక్క అయితడు. గందుకె డాకుటర్లు లేరు బాంచెను-" అన్నాడు ఈరడు.

"మరి ఆ తపాలా పార్టీ రంగడికి ఎలా దొరుకుతున్నదయ్యా డాక్టరు?..."

"అళ్ల ఇంట్ల ఏదో కార్యంబడిందట. నిన్న చాన మంది సుట్టాలు వచ్చిండ్లు. దాంటె డాకుటర్లు వున్నరో ఏందో..." ఈరని పక్కన నిల్చున్న పని మనిషి చెప్పాడు.

"ఆ... నాకొక ఉపాయం తోస్తాంది" అన్నాడు బొజ్జనిమురుకుంటూ ఓ నాయకుడు.

"ఏందో చెప్పుండ్రి..." కుతూహలంగా అడిగాడు చిన్నయ్య.

"ఆడు ఇప్పుడె డాక్టర్ను తెస్తం అని పోయిండేమో...మనం వాడికంటె ముందుగాల్నె డాక్టర్ను కొంటబోదాం..." అన్నాడు బొజ్జనాయకుడు.

"అది ఎట్లననే కదా ఆలోచన చేసేది..."

"మన దాంట్ల ఎవలూ డాక్టరులేరా?"అని అడిగాడు వీకర్ సెక్షన్ల పార్టీ అని చెప్పుకుంటున్న చెంబుపార్టీ నాయకుడు.

అందరిని ఒకసారి కలియజూసి - "లేరు" అని చెప్పాడు చిన్నయ్య.

"తలుచుకుంటె మనలో ప్రతి ఒక్కడూ డాక్టరేనయ్యా..."

"అది సరేనండీ... ఇప్పుడీ గండం గట్టెక్కేదెట్లా? ఆ రంగడు... ఆ తొత్తునా కాడుకు అరిజనుల ఓట్లన్ని కొట్టేస్తడండి. ఒకటా రొండా రొండు వందల ఓట్లు... ఈకర్ సెక్షన్లంతా

గిట్లనే తపాలా పార్టీ రంగని పాలైతే నాగతేం కావాలె? మన పార్టీ పరువేం గావాలె? నిజానికి ఈకర్ సెక్షన్ల సేవ చేసేటోల్లం మనం కదా... మన పార్టే ఈకర్ సెక్షన్ల పార్టీ కదా... ఆ ఈకర్ సెక్షన్ అరిజనుడికి మందులు ఇప్పించె హక్కు ఆ రంగడికి ఎక్కడిది? అది మన హక్కు మనం చేసే పని.. మాదిగోళ్ళు, మన్నెపోల్లు, కమ్మరోల్లు, కుమ్మరోల్లు, బెస్తోల్లు, ఈ ఈకర్ సెక్షన్లంతా మనోల్లండి... అడెందుకు పోతాండు వాళ్ళ ఇండ్లల్లకు" అంటూ ఆవేదన వెలిబుచ్చాడు చిన్నయ్య దొర.

"నీకేం ఫరవాలేదయ్యా చిన్నయ్యా... ఈకర్ సెక్షన్లను వాడి పరం కానిస్తామా... ఇంత మంది నాయకులం వుండి!...ఓ తెల్లకోటు వుందేమో చూడు..." అన్నాడు బొజ్జ నాయకుడు.

"తెల్లకోటా! ఎందుకు?"

"అబ్బ ముందు తేవయ్యా చెప్తా..."

ఈరన్ని పంపించి ఓ పాత తెల్లకోటు తెప్పించాడు చిన్నయ్య.

"అరె ఇటా" - అని ఈరన్ని దగ్గరికి పిలిచుకున్నాడు బొజ్జనాయకుడు -

"అవుతల కార్ల మా డ్రైవరు వుంటడు చూడు...వాడ్ని తీసుకురా పో... వాడైతే కొంచెం ఎర్రగ బుర్రగ వున్నడు... ఈ కోటేసుకుంటే అచ్చం అప్పుడే ఆస్పిటల్ నుంచి వచ్చిన డాక్టర్ లెక్క వుంటడు. మనం ఆ గుడిసె ముందల నిలబడి... ఆరిజన వాడల అందరి ఆరోగ్యాన్ని పరీక్ష చేయడానికి పట్నంనుంచి డాక్టర్‌ను పిలిపించినం... ఉళ్ళల్ల మలేరియా జొరాలు వచ్చి జనం పోతున్నరు కదా...అందరికి ఒట్టిగనే మందులు ఇప్పిస్తాం. ఇయ్యాల ఈ ఈకర్ సెక్షన్ గాణ్ణి చూసి మందిచ్చి పోతాడు డాక్టర్. రేపు నర్సులను, మందులను ఎంట బెట్టుకుని వస్తడు... అని చెప్పాలె. చెప్పినంక అందరు చూస్తాంటె మన డాక్టరు చేత ఆ తపాలగాడి కంటె ముందుగాల్నె ఈకర్ సెక్షన్‌గాడికి మందులుఇప్పించాలె..." అన్నాడు బొజ్జ నాయకుడు ఈరన్ని పంపించాక చిన్నయ్యతో -

ఈరడు వెళ్ళి బొజ్జ నాయకుడి కారు డ్రైవర్ని తీసుకొచ్చాడు.

"అరేయ్... ఈ కోటేసుకో..." కోటు చూపించాడు.

డ్రైవర్ తెల్లమొగం వేసి తెల్లకోటు వేసుకున్నాడు. "ఆ నువ్విప్పుడు డాక్టరువి. దొర వెంటబోయి ఓ ఈకరుసెక్షను గాడికి మందిచ్చి రావాలె..." ఆజ్ఞాపించాడు నాయకుడు.

"నేనా సార్!...." డ్రైవర్ ఇంకా తెల్లబోయాడు.

"దొరా మరి మందులో?" జ్ఞాపకం చేశాడు ఈరడు.

"మందులా!... మన దగ్గర మందులకేం కొదవరా... మన ఒళ్ళే ఓ మందుల పుట్టాయె... ఏది నా బ్రీఫ్ కేస్ ఇటుపట్రా..." అన్నాడు.

ఈరడు బ్రీఫ్‌కేస్ తెచ్చి ఇచ్చాడు.ఆ నాయకుడికి విరోచనాలు కొంచెం ట్రబుల్. అందుకే పర్గోలాక్స్ ఎప్పుడూ దగ్గరుంచుకుంటాడు. బి.పి., టాబ్‌లెట్స్, వగైరా...

"చిన్నయ్య గారూ ఓ బ్యాగ్ ఇప్పించండి వీడికి –" అన్నాడు చిన్నయ్యతో.

చిన్నయ్య ఓ నల్లబ్యాగు తెప్పించాడు. ఆ బ్యాగ్‌లో టాబ్‌లెట్స్ వేసి డ్రైవర్‌కు ఇచ్చాడు. ఇంకేం... తెల్లకోటు, నల్లబ్యాగు...డాక్టర్ తయారయ్యాడు!!

"ఇగ దాక్టరును తీసుకపో చిన్నయ్యా ఈకర్ సెక్షన్ల వాడకు. ఇంతకు ముందు చెప్పిందంతా చెప్పు. నేను రెస్ట్ తీసుకుంటా...రాత్రికి రాజధాని ప్రయాణం కదా..." అన్నాడు బొజ్జ నాయకుడు.

చిన్నయ్య ఆ బొజ్జ నాయకుడిగారి మెడ కౌగిలించుకొని...ఆ తరువాత చేయి దొరికించుకొని...

"మీ బుర్ర అమోఘం...మీలాంటి బుర్రలే మన చెంబు పార్టీకి సీరామరక్ష" అని పొగిడాడు చిన్నయ్య.

ఆ నాయకుడు బొజ్జ అదిరిపోతుండగా పెద్దగా నవ్వి "నాదేం బుర్రండి... నాకంటె గొప్ప బుర్రలున్నయండి మన పార్టీల..." అన్నాడు.

"తొందరగా దాక్టరును తీసుకపోండి. లేకపోతే హరిజనవాడలో శత్రువులు చొరబడతారు" అని హెచ్చరించాడు ఒక నాయకుడు.

బొజ్జనాయకుడు సృష్టించి ఇచ్చిన డాక్టరును వెంటబెట్టుకొని కొంత మంది పని వాళ్ళను, కాబోయే ఆస్థాన గూండా పరివారాన్ని తీసుకొని హరిజన సేవకు... వీకర్ సేక్షన్ల సేవకు తరలి వెళ్ళాడు చిన్నయ్య దొర.

ఆలస్యమైతే శత్రుపక్షం ఎక్కడ ప్రజాసేవ చేస్తుందోనని భయపడి వురుకుల పరుగులతో హరిజనవాడ చేరుకున్నారు -

అంతలో ఓ విచిత్రం జరిగింది.

తపేలా పార్టీ రంగయ్య కూడా ఓ డాక్టరును వెంటబెట్టుకొని చంద్రయ్య గుడిసె చేరుకున్నాడు.

చిన్నయ్య దొరగారి గూండా గారు... కాబోయే ఆస్థాన గుండాగారు తపాలా పార్టీ డాక్టరుకు అడ్డం నిల్చొని గుడిసె వైపు పోనివ్వలేదు...

“చెంద్రు గాడు... ఈకర్ సెక్షన్లంతా మనోళ్లు. డాక్టరు మనోళ్ళను మనం చూసుకోవాలె గాని మంది చూస్తారా... ఉర్లల్ల మలేరియా వుందంటిరి, రేపు నర్సులను, మందులను పట్టుకొని వస్తనంటిరి. ఇయ్యాల మా చెంద్రుగానికి జెర చూసి మందులిచ్చి పోండ్లి... వానికి జెప్పున రోగం తక్కువ కావలె... వాడు నాకు కుడిభుజం అసోంటోడు... పో డాక్టరు పోయి చూడు పో...” అని తాను తెచ్చిన డాక్టరును ముందుకు తీసుకపోబోయాడు చిన్నయ్య.

“ఆగవయ్యా... చెంద్రుగాన్ని మా డాక్టరు చూస్తడు... వాడు మా మనిషి... ఈ హరిజనవాడ... ఈకర్ సెక్షన్లంతా మా వాళ్ళు... మా పార్టీ కొన్ని ఏండ్ల బట్టి ఈకర్ సెక్షన్ల సేవ చేస్తోంది. ఇప్పుడు కూడా మేమే చేస్తం... ఎవ్వలను చేయనివ్వం... అంటూ చిన్నయ్య డాక్టరుకు అడ్డు నిలిచాడు తపేలా పార్టీ రంగయ్య.

“మేం మీ కంటె ముందు నుంచే ఈకర్ సెక్షన్ల సేవ చేస్తానం – అసలు మా పార్టే ఈకర్ సెక్షన్ల కోసమే పుట్టింది... జిందాబాద్ జిందాబాద్... తపేలా పార్టీ జిందాబాద్...” రంగయ్య వెంటనున్న తపేలా పార్టీ మనిషి అరిచాడు –

“నోర్మూయరా కుర్ర నా ఎధవ – మీ పార్టీ ఈకర్ సెక్షన్ల పార్టా!... పోయిన ఎలక్షన్ల ఈకర్ సెక్షన్ల గుడిశెలన్నీ తగులపెట్టినప్పుడు ఏడబోయిందో ఈ తెలవి?...” చెంబు పార్టీ నుంచి అరుపులు –

“మేం గట్ల తగులబెట్టెటోల్లం కాదు మీరే తగులబెట్టి మా పేరు బదునాం చేసిండ్లు...”

“అవునవును అడ్డ బాట గుట్టకాడ వంతెన కట్టిస్తనని మా ఎమ్మెల్యేనే కదా జనం దగ్గర...సర్కారు దగ్గర డబ్బు దొబ్బి పత్తా లేకుండ ఉడాయించింది.”

“అవుమల్ల – నువ్వు సొక్కం పార్టీల వున్నవనుకుంటాననా – ఈకర్ సెక్షన్లకు భూములిస్తున్నం, బర్రెల్నిస్తున్నం అని ఇచ్చినట్టె ఇచ్చి బామ్మరుదుల పేర, బావల పేర రాసుకునేది ఎవ్వరో ఈకర్ సెక్షన్లకు ఎరికే...!”

“అవునవును...ఎందుకెరుకలే... పోయినేడు ఈకర్ సెక్షన్ల సేవచేస్తానం అని అరిజన వాడలు ఊడ్చి పుల్లమ్మకు కడుపు చేసి దాని బావిల నూకింది ఎవరో అందరికి ఎరికే...”

“అవున్రా... మా పార్టే కాదు...ఈకర్ సెక్షన్ల పార్టీ అనుకుంటనే... ఈకర్ సెక్షన్ల పొల్లలను తీసుకుపోయి హైద్రాబాద్‌ల అమ్మివొస్తాంది....”

"నోర్మూయిరా... ఇప్పసారా పోసి మేమే కాదు ఓట్లు కొంటానం..."

"అవున్రా చెంబుల కొద్ది గుడుంబా గుమ్మరించి మేమే కాదు ఓట్లు కొంటుంది..."

"ఈ దున్నపోతుల మాట ఇనుకుండ్లి జనులారా మాదే ఈకర్ సెక్షన్ల పార్టీ..."

"ఈ లంబ్డీ కొడుకుల మాట ఇనుకుండ్లి జనులారా మాదే ఈకర్ సెక్షన్ల పార్టీ..."

అలా బూతు మాటల్లోకి దిగిపోయి ఒకరినొకరు నెట్టుకుంటూ హరిజన గుడిసెల్లోకి పోవడానికి పోట్లాటకు దిగాయి ఈ వీకర్ సెక్షన్ల పార్టీలు...

గుడిసెలో చెంద్రయ్య కొన ఊపిరితో కొట్టుకుంటున్నాడు - భార్య, పిల్లలు చుట్టూ కూర్చొని ఏడుస్తున్నారు.

భర్త పడుతున్న అవస్థను చూడలేక చంద్రయ్య భార్య నర్సమ్మ గుడిసె బయటికొచ్చి రెండు చేతులు జోడించి దీనంగా ప్రార్థించింది....

"అయ్యా... మీరు నా పిల్లల గోస సూదుండ్లి... మామావ...ఎట్లనో సేత్తాండయ్యా... ఎవర్నన్న ఒక డాకుటరును రానీయండ్లయ్యా..."

"మా డాక్టరే చెంద్రుగాన్ని చూడాలె-" అంటూ చిన్నయ్య ముందుకొచ్చాడు.

"అట్లెట్ల... మా డాక్టరే...చెంద్రుగాన్ని చూడాలె..." అంటూ రంగయ్య ముందుకొచ్చాడు.

"మా పార్టే...మా చెంబు పార్టే ఈకర్ సెక్షన్ల పార్టీ... మా డాక్టరే చెంద్రుగాన్ని ముట్టుకోవాలె..."

"మా పార్టే... తపాలా పార్టే... ఈకర్ సెక్షన్ల పార్టీ... మా డాక్టరే చెంద్రుగాన్ని ముట్టుకోవాలె..."

"ఎవలన్న ఒగలు డాకుటరును రానియిండ్లుల్లా... ఓయ్య మీ కాల్మొక్త... మీ బాంచెను... మీకు దండం పెడ్తనయ్యా... మా గోస సూదుండ్లయ్యా..." గోదు గోదున విలపించింది నర్సమ్మ.

తల్లి ఏడ్వడం చూసి పిల్లలు బిగ్గరగా ఏడుస్తున్నారు. భయం భయంగా అటుఇటు చూడసాగారు....

చుట్టుపక్కల వాడల్నించి వచ్చిన జనం అక్కడ జరుగుతున్న వాదాన్ని...దొమ్మిని చూస్తున్నారు.

"ఓయ్యా... నీ కాల్మొక్త దొర నీ కాల్మొక్త...." ఇద్దరి కాళ్ళ ముందు పడిపోయి... "నా పసుపు కుంకుమ నిలుపుండ్లి, దొరా... నా పిల్లల్ని పచ్చుల్ని సేయకుండ్లి... డాకుటరును పోనీయిండ్లి దొరా..." రెండు చేతుల జోడించి వాళ్ళ కాళ్ళకు మొక్కింది నర్సమ్మ -

"నర్సమ్మ నీకేం భయం లేదు లేవే - చెంద్రుగాన్ని మా డాక్టరు చూస్తడు..." చిన్నయ్య నర్సమ్మ రెక్క బట్టి లేవనెత్తాడు.

"నర్సమ్మ... మేం ఉన్నం చెంద్రుగాన్ని పానాన్ని కాపాడ్తం - మా డాకుటరు చూస్తడు" రంగయ్య మరో రెక్కపట్టుకొన్నాడు.

తల్లిని వాళ్ళేదో చేస్తున్నారని ఏడుస్తున్న పిల్లల్లో ఒక పెద్ద పిల్లవాడు దోసిలతో మట్టి తీసి వాళ్ళ కళ్ళల్లో చల్లాడు...

"ఆ పోరగాన్ని పట్టుకోరా..." అన్నాడు చిన్నయ్య.

కాబోయే ఆస్థానగుండా ఆ పిల్లాడ్ని పట్టుకొని తలమీద కొట్టాడు...

"అరేయ్ మా వీకర్ సెక్షన్ల పొలగాన్ని కొడ్తావ్..." చెంద్రయ్య గుడిసె బొంగులాగి కాబోయే ఆస్థానగుండా మీదికి వచ్చాడు రంగయ్య పార్టీ మనిషి.

చెంబు పార్టీ మనిషి కూడా చెంద్రయ్య గుడిసె బొంగులు లాగి అతని మీద కలియ బడ్డాడు.

గుడిసె సగానికి పడిపోయింది.

"ఓవ్వో.... ఓ నాయనో...నా మావ సచ్చిండే..." వాళ్ళను విడిపించుకొని సగం కూలిన గుడిసెలోకి పరుగెత్తింది నర్సమ్మ.

అప్పటికె చంద్రయ్య కాళ్ళ మీద చిన్న దూలం వచ్చి పడింది.

గావుకేక పెట్టి చెంద్రయ్యను బయటికి లాగుతున్నది నర్సమ్మ -

సహాయంగా రంగయ్య వెళ్ళబోయాడు - "నువ్వెట్ల పోతవ్... నేను వీకర్ సెక్షన్ల మనిషిని..." అంటూ రంగయ్యను నెట్టేసాడు చిన్నయ్య -

చిన్నయ్య కోపంతో గుడిసె సూరులోంచి ఓ కట్టెను లాగి రంగయ్యమీదికి వచ్చాడు.

గుడిసె కప్పుకూలి చెంద్రయ్యను బయటికి లాగుతున్న నర్సమ్మ మీద పడింది. పిల్లలు గగ్గోలు, పెడబొబ్బలు పెట్టారు -

"నీ యవ్వ ఈ దొంగ నాయాల్లను తరుముండ్లిరా..."

చూస్తున్న జనం నుంచి కుమ్మరి మల్లన్న ముందుకు దూసుకు వచ్చాడు..

"నీ యవ్వ మేం ఈకర్ సెచ్చన్ల మన్సుల మంటె మేం ఈకర్ సెచ్చన్ల మనుసుల మని మా పాణాలు తీత్తారు.నడువుండ్లిరా...ఇక్కన్నుంచి ఎల్లిపొండ్లి..." ఆవేశంగా చిన్నయ్య, రంగయ్యల మీదికి వచ్చాడు.

అంతసేపు కేవలం ప్రేక్షకులుగా మిగిలిపోయిన జనానికి చెంద్రయ్య ప్రాణాల్ని కాపాడాలని ఉంది...డాక్టర్లను ఆపుతున్న చిన్నయ్య, రంగయ్యలను వారి సహచరులను దూరంగా తరిమేయాలని ఉంది - కాని ఎవరికి ధైర్యం చాల్లేదు. కుమ్మరి మల్లన్నను చూడగానే అందరికి ధైర్యం వచ్చింది.

జనం బాణాల్లా దూసుక వచ్చారు.

ముందుగా కొంత మంది చెంద్రయ్యను, నర్సమ్మను, పిల్లలను ఒక చెట్టు కిందికి చేర్చారు.

డాక్టర్లను కొంతమంది పట్టుకున్నారు.

కొందరు చిన్నయ్యను, రంగయ్యను వారి బలాలను తరిమేశారు.

"నీ అవ్వ వీల్లారా మనకు సేవ చేసేది - వీళ్ళారా మన బతుకుల్ని బాగు చేసేది? వీళ్లకు మనమీద జాలి వున్నాదిరా... వీళ్ళకు మనమీద దయ వున్నాదిరా?.... వీళ్ళకు మన మీద ప్రేమ వున్నాదిరా? వుంటె గిట్ల ఒక మనిషి చావు బతుకుల్ల కొట్టుకుంటుంటె మేం సేవ చేత్తమంటె మేం సేవ చేత్తమని వాళ్ళదాంట్ల వాళ్ళె కొట్టుకొని వచ్చిన డాకుటర్లను సూడనీయకుండ ఆపుతార్రా!... మనం ఎట్లబోతె వాళ్ళకేందిరా... మనం ఎట్లసత్తె వాళ్ళ కేందిరా... వాళ్ళకు మనం ఓట్లంరా... ఓట్ల కోసం మనకాడికి వొత్తర్రా..."

కుమ్మరి మల్లన్న పిడికిలి బిగుసుకుంది -

డాక్టర్లు వణికిపోతున్నారు.

కుమ్మరి మల్లన్న, చాకలి ఎల్లయ్య, ఓదెలు వాళ్ళ చేతులు పట్టుకొని "జెర చెంద్రుగాన్ని సూడుండ్లి బాంచెను.... చెంద్రుగాని పాణాలు కాపాడుండ్లి బాంచెను...." అంటూ ప్రాధేయపడ్డారు.

చిన్నయ్య తీసుకొచ్చిన డాక్టరు వణికిపోతూ తన అసలు రూపం ఏమిటో చెప్పాడు... ఇందులో తన తప్పేంలేదని తనను వొదిలేయమని వేడుకున్నాడు -

అతన్ని వొదిలేసి... "తూ.... నీ అక్క లంబ్డికొడుకులు - వాడు చిన్నయ్య మీ

ఈకర్ సెచ్చన్ల నాయకుల్ని అని ఎంత పనిచేసిండ్లో చూసిండ్లా....” అని ఉమ్మేశాడు మల్లన్న.

రంగయ్య తెచ్చిన డాక్టర్ను బ్రతిమిలాడాడు - అతడు నిలువునా వణికి పోతున్నాడు. మొహం నిండా చెమటలు పట్టేశాయి....“అన్నా... నేను డాక్టర్ను కాను - రంగయ్య దొర స్నేహితుని ఇంట్ల పనిమనిషిని... నన్ను డాక్టరు అని చెప్పి తీసుకొచ్చిండ్లు....” అంటూ రెండు చేతులు జోడించాడు.

“చూసిండ్లారా ఎల్లన్న...ఒరేయ్ చాకలి వుల్లన్న... కమ్మరి నర్సన్న... బెస్త గోపన్న...మనం ఈకర్ సెచ్చన్లమని మనకు సేవచేత్తమని వచ్చే నాయకుల పగటి వేషాలు చూసిండ్లా... చూసి నావురా ముత్తిగ... అరిజనవాడని వాళ్ళకు పేమ గదరా... ఓడు డ్రైవర్ని డాకుటరని తీసుకొచ్చిండు... ఓడు పనిమనిషిని డాకుటరని తీసుకొచ్చిండు. మనిషి ఈడ చావు బతుకుల్ల వుంటె వాళ్ళు ఏస్తున్న ఏసాలు చూసిండ్లా మనం కలువంగనే దొంగనాకొడుకులు పారిపోయిరి గదరా... మనం ఈకర్ సెచ్చన్లం. మనకు సేవ చేత్తమని వచ్చిన దొంగ లంబ్డికొడుకులు పారిపోయిరి గదరా... అసలు ఈకర్ సెచ్చన్లు వాళ్లురా... బలీనం వర్గం వాళ్ళదిరా... మనం కాదు బలీనులం. మనది కాదు బలీనవర్గం.మనం ఒక్కటైతే అసొంటి కుక్కలన్నీ మన ముందు తోకాడిస్తయిరా... అరేయ్ గోపన్న నువ్వు బండి కట్టు చెంద్రుగాన్ని పట్నం తీసుకపోదాం. ఎంకన్న... పుల్లన్న... మీరు గుడిసె ఏయిండ్లి... ముత్తక్క లస్వక్క నువ్వు నర్సమ్మను పిల్లల్ని సూడుండ్లి.... మనబతుకుల్ని మనమే బాగుచేసుకోవాలె అన్నా... మనం కలిసి మన బతుకుల్ని బాగుచేసుకోవాలె అన్నల్లారా...అక్కల్లారా... ఈ దొంగలు మనల్ని బాగుచేయరు... మనల్నింక బలీనుల్ని చేత్తరు...” అందరి కళ్ళలోకి వెలుగుల్ని, గుండెల్లోకి కొత్త ఊపిరిని ఉదాడు మల్లన్న.

*ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక, 3 జూలై, 1987*